# శంకుస్థాపన

వాణిశ్రీ




**సుబ్రమణ్యం వెళ్లేసరికి రాజశేఖర్ ఇంట్లోనే ఉన్నాడు.**

"హమ్మయ్య, ఉన్నావా! బతికిపోయాను. ఉన్నావా, లేవా అనుకుంటూ వచ్చాను. మొత్తానికి దొరికావు. తిరుపతి వెళ్తే ఆ దేవుడి దర్శనమైనా ఈజీగా దొరుకుద్దేమో కానీ, ఎన్నిసార్లు తిరిగినా నీ దర్శనం దొరకడంలేదు!" అన్నాడు సుబ్రమణ్యం.

"రావోయ్, రా! జోకులు తర్వాత పేలుద్దువు గాని!" నవ్వుతూ ఆహ్వానించాడు రాజశేఖర్.

సుబ్రమణ్యం సోఫాలో కూర్చుని అప్పుడు గమనించాడు, అప్పటికే సోఫాలో కూర్చున్న మరొక శాల్తీని.

ఆ కుర్రాడికి ఇరవై పైన, పాతిక లోపు వయసుంటుంది. అందంగా, ముచ్చటగా ఉన్నాడు.

"ఎవరోయ్ ఈ కుర్రాడు?" అడిగాడు సుబ్రమణ్యం.

"మా బామ్మర్ది. శ్రీకాంత్!"

ఇద్దరికీ పరిచయం చేశాడు రాజశేఖర్.

"ఏం చేస్తున్నాడేం?"

"డిగ్రీ పూర్తిచేశాడు. ప్రస్తుతం నిరుద్యోగం" నవ్వుతూ చెప్పాడు రాజశేఖర్.

సుబ్రమణ్యం దీర్ఘంగా నిట్టూర్చాడు. విచారంగా తల ఆడించాడు. కళ్లజోడు తీసి కర్చీఫ్‌తో తుడిచి మళ్లీ పెట్టుకున్నాడు.

అతగాడు చేష్టలు గమనించిన రాజశేఖర్ భయపడ్డాడు. సుబ్రమణ్యం స్పీచ్‌కి తగులుకునే ముందు అటువంటి చేష్టలు చేస్తుంటాడు. ఇప్పుడిక నిరుద్యోగం మీద ఉపన్యాసం వినక తప్పదని అతని సిక్స్త్‌సెన్స్ హెచ్చరిస్తోంది.

హెచ్చరిక నిజమైంది.

సుబ్రమణ్యం మొదలుపెట్టాడు.

"రోజులు మారాయి. మారుతూనే ఉన్నాయి. ఒకప్పుడీ వెధవ చదువులు లేవు. హాయిగా కుల వృత్తులుండేవి. ఎవరి పని వాళ్లు చేసుకుంటూ సుఖంగా ఉండేవాళ్లు. ముఖ్యంగా వయసొచ్చిన కుర్రవాళ్లకి ఇప్పటిలా అభద్రతాభావం చచ్చినా ఉండేది కాదు. మూతిమీద మీసం మొలవగానే పెళ్లి చేసేవారు. కులవృత్తులు చేసుకుంటూ పెళ్లాన్ని పోషించేవారు. వెనకా ముందూ ఆలోచించే పని ఉండేది కాదు. పెళ్లయితే ఇల్లెలా గడుస్తుందిరా దేవుడా? అని ఏడ్వాల్సిన పనే ఉండేది కాదు. ఈ మాయదారి చదువులొచ్చాక అంతా తల్లకిందులైపోయింది. జనం వేలంవెర్రిగా పిల్లల్ని చదివించడం మొదలుపెట్టారు. వృత్తులు మానేశారు. ఒకప్పుడు బందర్లోనో, గుంటూర్లోనో కాలేజీలుండేవి. తర్వాత ఎక్కడో మద్రాసులో కాలేజీలుండేవి. ఇప్పుడు

## మూడో ఓటు...

ఎన్నికలలో ఓడిపోయిన సుబ్బారావుకు కేవలం మూడు ఓట్లుమాత్రమే పడ్డాయి.

దాంతో అతడిభార్య, "నిజం చెప్పండి.. మీ ఓటు, నా ఓటు కాక మరో ఓటుకూడా మీకు పడింది. ఎవరా చిన్నింటిది...చెప్పండి?' ' అంటూ నిలదీసింది.

**భూక్యా గోపీనాయక్**, వినుకొండ

---

చూడు, వీధి వీధికీ కాన్వెంటులు, ఊరూరికీ కాలేజీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. అంతా తెగ చదివేసి డిగ్రీలు పుచ్చేసుకుంటున్నారు. మరి వీళ్లందరికీ చెయ్యడానికి ఉద్యోగాలేవీ? అమ్మా, అయ్యా డబ్బులు పంపిస్తుంటే ఏదో చదివారు. తర్వాత ఉద్యోగాలు లేక, ఎవరిస్తారో తెలీక, అసలు ఏం చేయాలో అర్థంకాక కుర్రాళ్లంతా డైలమాలో పడిపోతున్నారనుకో!''

"అదేనోయ్, మా శ్రీకాంత్ సమస్య కూడా. వాళ్ల ఊళ్లో ఎటూ ఏ ఉద్యోగమూ దొరకదు. అందుకని సిటీ వచ్చేయమన్నాను. ఇక్కడ కొన్నాళ్లుండి ఏ కంప్యూటరో నేర్చుకుంటే ఏదైనా ఉద్యోగానికి ప్రయత్నించొచ్చు!'' సుబ్రమణ్యం ఉపన్యాసాన్ని అడ్డుకుంటూ చెప్పాడు రాజశేఖర్.

"నా బొంద కంప్యూటర్! నీకు తెలుసో లేదో? మన సిటీలో కంప్యూటర్ కోర్సులు నేర్పే ఇన్స్టిట్యూట్‌లు మూడువందలు వరకూ ఉన్నాయి. ఏవేవో కోర్సులు నేర్పుతున్నారు. అవిచేసిన వాళ్లూ రోడ్లమీదే తిరుగుతున్నారు. వాటికి మాత్రం ఎన్నని ఉద్యోగాలుంటాయి చెప్పు?'' అన్నాడు సుబ్రమణ్యం.

సుబ్రమణ్యం మాటలు వింటున్న శ్రీకాంత్ గుండెలో రాయిపడింది. డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లయినా పనీ, పాటా లేకుండా తిరుగుతున్నారని వాళ్ల నాన్న తెగగొణుగుతున్నాడు. ఇప్పుడు మళ్లీ డబ్బులు తగలేసి కంప్యూటర్‌కోర్సులు చేసి అప్పుడు కూడా ఉద్యోగం దొరక్కపోతే, చెప్పుతీసుకుని తంతాడు. శ్రీకాంత్ నీరుగారిపోయాడు.

రాజశేఖర్ బావమరిది అవస్థ గమనించి సుబ్రమణ్యాన్ని అడ్డుకున్నాడు.

''ఇంతకీ నా కోసం తెగ తిరుగుతున్నావన్నావ్? ఏమిటి విశేషం?''

' ' వ రా

తమ్ముడొకడున్నాడోయ్. నిరుద్యోగి. ఇక ఏ ఉద్యోగమూ రాదని నిర్ణయించుకున్నాడులే. ఆ ప్రయత్నాలన్నీ మానుకున్నాడు. ఏదైనా చిన్న వ్యాపా రం చేస్తానని గొడవపెడుతున్నాడు. అనుభవం లేకుండా ఏం వ్యాపారం చేస్తాడు? ఆలోచిస్తే నువ్వు గుర్తొచ్చావు. మీ కంపెనీ సిమెంట్ డీలర్‌షిప్పు మా వాడికి ఇప్పించాలోయ్! ఆ చుట్టుపక్కల ఎక్కడా సిమెంట్ డీలర్ లేడు. వ్యాపారం బాగానే ఉండొచ్చు. ఈ మధ్య అంతా పాతఇళ్లు పడగొట్టి, డాబాలు, మేడలు కట్టిస్తున్నారులే!''అన్నాడు సుబ్రమణ్యం.

"దానికేముంది? డీలర్‌షిప్పు ఇప్పిస్తా. డిపాజిట్టు కట్టాలోయ్!'' అన్నాడు రాజశేఖర్.

"తప్పకుండా కడదాం. అయి తే మావాడిని ఒకసారి పిలిపించి డైరెక్ట్‌గా నీతో మాట్లాడిస్తా! ఒకసారి అందరం మీ సిమెంటు ఫ్యాక్టరీకి కూడా వెళ్లొద్దాం. ఏమంటావు?'' అన్నాడు సుబ్రమణ్యం.

"అలాగే.''

సీత తెచ్చిన కాఫీ తాగి, మరొక అరగంట స్వయం ఉపాధిపథకాల గురించి ఉపన్యాసం దంచి వెళ్లాడు సుబ్రమణ్యం.

శ్రీకాంత్ తల సోఫాలో ఒరిగిపోయి ఉంది. వడదెబ్బ తగిలినవాడిలా కళ్లు తేలేశాడు.

"ఏమిటోయ్! అలా ఉన్నావ్? సుబ్రమణ్యం సుత్తికి బలైపోయావు ఈ రోజు. వాడంతే! తుమ్మ బంక! పట్టుకుంటే వదలడు!''

"అది కాదు, బావా! నేను కూడా మా ఊళ్లో సిమెంటు డీలర్‌షిప్ తీసుకుంటే బాగుంటుంది కదా! ఇప్పుడు మా ఊరు మండల కేంద్రమైంది. బట్టలషాపులు, చెప్పుల దుకాణాలు, ఫాన్సీ వగైరాలన్నీ ఉన్నాయి కానీ సిమెంటు డీలర్ ఎవరూ లేరు. మా మండలంలో ఏభై ఊళ్లన్నా ఉన్నాయి. బిజినెస్ బాగానే జరుగుతుంది. అయినా సిమెంటు చెడిపోయేదేం కాదుగా! ఏమంటావు బావా?'' అన్నాడు శ్రీకాంత్.

రాజశేఖర్ నవ్వి, "మొత్తానికి సుబ్రమణ్యం ప్రభావం నీ మీద పడిందన్నమాట. వెరీ గుడ్! నీకు ఉత్సాహముంటే బిజినెస్సే చెయ్యి. కలిసొస్తే దానికి మించింది ఏముంది?'' అన్నాడు.

శ్రీకాంత్ మర్నాడే ప్రయాణమై వెళ్లిపోయాడు. తర్వాత ఉత్తరం రాశాడు.

అక్కడ బిజినెస్ సెంటర్లో కొట్టు మాట్లాడి, అడ్వాన్సు ఇచ్చానని, డిపాజిట్ కట్టడానికి డబ్బు పోగుచేస్తున్నాననీ, పంటలకి సరైన ధర లేదనీ, పెరిగిన తర్వాత అమ్మి డబ్బులిస్తానన్నాడు నాన్న అనీ, త్వరలో వస్తాననీ రాశాడు.

బావమరిది ఒకదారిలో పడబోతున్నాడని సంతోషించాడు రాజశేఖర్.

ఏదో ఒకరోజు బావమరిది వస్తాడనీ, తను సిమెంటుకంపెనీలో ఉద్యోగం చేయడం వల్ల వాడికి డీలర్‌షిప్పు ఇప్పించగలుగుతున్నాననీ సంతృప్తి పడుతున్నాడు రాజశేఖర్.

రెండు నెలలైనా శ్రీకాంత్ రాలేదు.

ఎందుకు రాలేదు? ఒకవేళ డబ్బుకు ఇబ్బంది పడుతున్నాడా? పోనీ తనతో ఆ సంగతి చెప్తే సర్దుబాటు చేసేవాడు కదా! అడగడానికి మొహమాట పడుతున్నాడా? అనుకుంటూ బామ్మర్దికి ఉత్తరం రాయాలనుకున్నాడు. అనుకున్నాడే కానీ వారమైనా రాయలేకపోయాడు తీరిక లేక.

ఈలోపల శ్రీకాంత్ హఠాత్తుగా ఊడిపడ్డాడు.

"ఏమోయ్! డబ్బు దొరకలేదా? నాకు చెప్తే ఏదో ఒకటి చేసేవాడిని కదా!'' అన్నాడు రాజశేఖర్ కోప్పడుతూ.

"అది కాదు, బావా! డబ్బుగురించి కాదు.''

"మరేమిటి?''

"మా ఊళ్లో ఇక సిమెంట్ బిజినెస్ నడవదు బావా! అందుకని పట్నంలోనే ఏదో ప్రయత్నం చెయ్యాలనుకుని వచ్చా!'' అన్నాడు శ్రీకాంత్.

"అదేమిటి? ఎందుకు నడవదు? ఈ లోపలే ఎవరైనా పెట్టారా?''

"ఊహుఁ. నువ్వు పేపర్లో చదవలా? మా ఊరికి దగ్గర్లోనే నది మీద బ్రిడ్జి కట్టడానికి శంకుస్థాపన చేశారనీ.''

"అయితే?''

"అక్కడ కాంట్రాక్టర్లకు గవర్నమెంటు సిమెంటు సరఫరా చేశారు కదా బ్రిడ్జిపనులకి. అందులో కొంత కాంట్రాక్టర్లు బ్లాకులో అమ్ముతారు కదా! మీ కంపెనీ బస్తా వందరూపా యలుంటే, వాళ్లూ ఏ అరవై, డెబ్బైలకో అమ్ముతారు. ఇక జనం బజార్లో ఎందుకు కొంటారు? ఈ విధంగా ఆ బ్రిడ్జి ఎన్నేళ్లు కడతారో అన్నేళ్లూ అక్కడ సిమెంటు బిజినెస్ నడవదు!'' చెప్పాడు శ్రీకాంత్.